ఎడతెరిపి లేకుండా.. కురిసిన వర్షం

కురిసిన వర్షానికి జలమయమైన అత్తాపూర్ రోడ్డు

షౌకత్‌నగర్ బస్తీలో అధికారులతో కలిసి నీటి నాణ్యతను పరిశీలిస్తున్న జీఎం హరిశంకర్

మైలార్‌దేవ్‌పల్లి, ఆగస్టు 31 : ఎడతెరిపి లేకుండా తెల్లవారుజాము నుంచి కురిసిన వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పెరుగుతూ, తగ్గుతూ వర్షం ఉదయం నుంచి సాయంత్రం వరకు కురిసింది. దీంతో ప్రజలు ఇండ్లకే పరిమితమయ్యారు. అత్యవసర పనులు ఉంటే తప్ప ప్రజలు బయటకు రాలేదు. చాలా మంది రెయిన్ కోట్‌లు, గొడుగులు చేతపట్టుకొని కనిపించారు. అత్తాపూర్, హైదర్‌గూడ, రాంబాగ్, పాండు రంగానగర్, మైలార్‌దేవ్‌పల్లి, కాటేదాన్, దుర్గానగర్, లక్ష్మి గూడ ప్రాంతాల్లో వర్షాలకు రోడ్లు పూర్తిగా జలమయంగా మారిపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పలు ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

జూబ్లీహిల్స్ : వర్షాలు కురుస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని.. నీటి నాణ్యతను పరిశీలించాలని జలమండలి డివిజన్ – 6 జనరల్ మేనేజర్ ఎస్.హరిశంకర్ అధికారులను ఆదేశించారు. డివిజన్–6 పరిధిలోని బంజారాహిల్స్, షౌకత్ నగర్ బస్తీ ప్రాంతాల్లో నీటి సరఫరా వేళల్లో అధికారులతో కలిసి పర్యటించి నీటి నాణ్యతను పరిశీలించారు. జలమండలి వినియోగదారులకు క్లోరిన్ టాబ్లెట్లు పంపిణీ చేశారు. తాగునీటిలో ఆర్‌సి ఓ. 5 పి.పి.ఎం. క్లోరిన్ శాతం సాధారణ స్థాయిలో ఉన్నట్లు తెలిపారు. నీటిని వేడిచేసుకుని తాగాలని సూచించారు. ఫిర్యాదులను 155313 టోల్ ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని కోరారు. 135 స్లమ్స్‌లో అధికారుల బృందాలు తాగునీటి నాణ్యతను పరిశీలిస్తూ చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో డీజీఎం జి.ఇందిరా షీలా రాణి, మేనేజర్ శివకుమార్ పాల్గొన్నారు.

సమన్వయంతో పరిష్కరించాలి

మణికొండ : వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు వహించాలని నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి సూచించారు. అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రోడ్లపై వర్షం నీరు, డ్రైనేజీలు పొంగిపోర్లకుండా, విద్యుత్ సమస్యలు రాకుండా, గోతులమయమైన రోడ్లకు మరమ్మతులు, తదితర సమస్యలు రాకుండా చూడాలన్నారు. వార్డు వారీగా అధికారులు అందుబాటులో ఉంటారని ప్రజలు ఎలాంటి సమస్య ఉన్నా అధికారులను సంప్రదిస్తే వెంటనే చర్యలు తీసుకుంటారని తెలిపారు. నార్సింగి 9,8,17వ వార్డులకు జనార్దన్ రెడ్డి (9603458256), వార్డు 6,7,15 వార్డులకు శ్రీధర్ (9489808351), మంచిరేవుల వార్డు 10, 15, 18 వార్డులకు వంశీ (8179035438), గండిపేట 11,13 వార్డులకు అహ్మద్ (9966126092), ఖానాపూర్ 12వ వార్డు రవి (9666401090), వట్టినాగులపల్లి 1వ వార్డు రంజాన్ పాషా (9912370ష89), గౌలిదొడ్డి 2వ వార్డు శ్రీనివాస్ (9912081989), ఎక్కడైనా డ్రైనేజీ సమస్యలు ఉంటే జవాన్ రాహుల్ (8333955237)లకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా సూచించారు.

గురుకుల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

హిమాయత్‌నగర్, ఆగస్టు 31: గురుకుల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ చేశారు. నిత్యంలో ఏదో ఒక గురుకుల విద్యాలయంలో ఫుడ్ పా యిజన్ కావడంతో విద్యార్థులు అస్వస్థతకు గురౌవుతున్నారని వాపోయారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. మానసిక ఉల్లాసం కోసం నిర్వహించే అవగాహన సదస్సులను విశ్రాంత అధ్యాపకులు, విద్యావంతులు, మానసిక నిపుణులతో నిర్వహించాలే తప్ప మతపరమైన వారితో నిర్వహించడం సరికాదన్నారు.

ఏకపక్ష నిర్ణయాలతో కార్పొరేటర్ల అసహనం

● హాజరు కాని కార్పొరేటర్లు

బండ్లగూడ, ఆగస్టు 31: అభివృద్ధి పనులపై మేయర్, అధికారులు తమకు సహకరించడం లేదని పలువురు కార్పొరేటర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అందుకే తాము కౌన్సిల్ సమావేశానికి హాజరు కాలేదన్లి వాపోయారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం కౌన్సిల్ తీర్మాణం ఉందని కార్పొరేటర్లు అందరికీ ఎజెండాను అధికారులు అందజేశారు. కాగా శనివారం అధికారులు మేయర్ మద్దెల లతాప్రేమ్‌గౌడ్, డిప్యూటీ మేయర్ రాజేంద్రర్‌రెడ్డి, ఒకటవ నంబర్ కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్ కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యారు. మిగితా కార్పొరేటర్లు ఎవరూ కూడా హాజరు కాక పోవడంతో కౌన్సిల్ సమావేశాన్ని మరో రోజుకు వాయిదా వేశారు.

కారు అద్దాలు పగులగొట్టి చోరీ

ఖైరతాబాద్ : కారు అద్దాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన సైఫాబాద్ పీస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురానికి చెందిన రతన్ శనివారం స్నేహితుడిని కలిసేందుకు ప్రసాద్ ఐమాక్స్ వద్దకు వచ్చాడు. ప్యారడైజ్ హోటల్‌లో ఆహారాన్ని సేవించారు. బయటకు వచ్చి చూసే సరికి తన కారు అద్దాలు పగులగొట్టి, ల్యాప్‌టాప్ ఉన్న బ్యాగును గుర్తుతెలియని దుండగుడు అపహరించాడు. పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీజనల్ డిసీజెస్ నివారణకు వైద్యశిబిరాలు

సోమవారం నుంచి వెక్టర్ బోర్న్ డిసీజెస్ క్యాంప్‌లు

ముందస్తుగా మొక్కల కుండీల్లో నిలువ ఉన్న నీటిని తొలగిస్తున్న ఆశవర్కర్లు

జూబ్లీహిల్స్ : వర్షాలతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్న అధికారులు తాజాగా ఔట్‌రీచ్ హెల్త్ క్యాంప్‌లు నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. సోమవారం నుంచి జూబ్లీహిల్స్, యూసుఫ్‌గూడ జీహెచ్ఎంసీ 18,19 సర్కిళ్లలో వెక్టర్ బోర్న్ డిసీజెస్ (వీబీడీ) క్యాంప్‌లు నిర్వహించేందుకు బల్దియా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. డెంగ్యూ కేసుల ప్రభావం ఎక్కువగా ఉన్న బస్తీలు, జ్వరాలు ఎక్కువగా నమోదవుతున్న ఆయా ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటుచేయనున్నారు. జిల్లా యంత్రాంగం, వైద్యారోగ్య.. కుటుంబ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో పీహెచ్‌సీలు, బస్తీ దవాఖానలు, క్లస్టర్ మలేరియా యూనిట్లు, జీహెచ్ఎంసీ ఎంటామాలజీ.. మలేరియా విభాగాలతో కలిసి కార్యాచరణ రూపొందించారు. స్థానిక సామాజిక భవనాలతో పాటు నేరుగా బస్తీలలో ఈ ఔట్ రీచ్ క్యాంప్‌లు ఏర్పాటుచేయనున్నారు. యాంటీ లార్వా ఆపరేషన్లతో పాటు డెంగ్యూ పాటిజివ్ కేసులు నమోదైన ప్రాంతాల్లోని 50 గృహాల్లో సర్వే చేయనున్నారు. డెంగ్యూ లక్షణాలుంటే శాంపిల్స్ సేకరించి పరీక్షలకు పంపడంతో పాటు ఆయా ప్రాంతాల్లో హెల్త్ క్యాంప్‌లు నిర్వహించనున్నారు.

ఎస్పీఆర్ హిల్స్‌లో హైటెన్షన్ వైర్లు తొలగించండి

ఎస్పీఆర్ హిల్స్‌లో ఇండ్లపై నుంచి వెళ్తున్న హైటెన్షన్ వైర్లు తొలగించాలని.. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఉమ్మడి బస్తీల డెవలప్‌మెంట్ ఫెడరేషన్ సొసైటీ సభ్యులు కార్పొరేటర్ సీఎన్ రెడ్డిని కోరారు. శనివారం శివమ్మ పాపిరెడ్డి (ఎస్పీఆర్) హిల్స్‌కు చెందిన 25 ఉమ్మడి బస్తీల డెవలప్‌మెంట్ ఫెడరేషన్ సొసైటీని కార్పొరేటర్ ఆవిష్కరించారు. 65 మంది సభ్యులతో ఏర్పాటైన సొసైటీకి చెందిన ప్రతినిధులు కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేశారు.

- జూబ్లీహిల్స్

టైప్ 1 డయాబెటీస్‌పై అపోహలు నమ్మవద్దు

డయాబెటీస్ పిల్లలతో డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

ఖైరతాబాద్ : టైప్ 1 డయాబెటీస్ సాధారణ చికిత్సతో తగ్గిపోతుందన్న అపోహాలను ప్రజలు నమ్మవద్దని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప సూచించారు. నిమ్స్‌లో ఎండోక్రైనాలజీ విభాగం ఆధ్వర్యంలో శనివారం టైప్ 1 డయాబెటీస్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా ఏడాదికి 1,21,1,900 మంది పిల్లల్లో ఈ వ్యాధిని గుర్తిస్తున్నారన్నారు. భారతదేశానికి సంవత్సరానికి 24వేల మంది పిల్లలకు టైప్ 1 డయాబెటీస్ గుర్తిస్తున్నారని, ఈ వ్యాధికి ఇన్సూలిన్ థెరపి మాత్రమే ఏకైక మార్గమన్నారు. పిల్లలు చదువులు, ఆటల్లో నిమగ్నం కావడం వల్ల ఇన్సూలిన్ డోస్‌ను తప్పుతున్నారని, దీంతో కొత్త సమస్యలు వస్తున్నాయన్నారు. ప్రస్తుతం అత్యాధునిక చికిత్స విధానాలు అందుబాటులోకి వచ్చాయని ఇన్సూలిన్ పంప్స్‌తో టైప్ 1డయాబెటీస్‌ను అదుపులో పెట్టుకోవచ్చన్నారు. తెలంగాణ ప్రభుత్వం వీటిని ఉచితంగా అందజేయడం ద్వారా పేద, మధ్య తరగతి పిల్లలకు సాంత్వన కలిగించవచ్చన్నారు. కార్యక్రమంలో నిమ్స్ డీన్ డాక్టర్ లీజా రాజశేఖర్, ఎగ్జిక్యూటీవ్ రిజిస్ట్రార్ డాక్టర్ శాంతివీర్ ఉప్పిన్, ఎండోక్రైనాలజీ విభాగాధిపతి డాక్టర్ బిట్రిస్ అని పాల్గొన్నారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా మాలల బస్తీబాట



బస్తీ బాటలో పాల్గొన్న కమిటీ ప్రతినిధులు

ఖైరతాబాద్, ఆగస్టు 31 : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా హలో మాల.. చలో బస్తీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో తుమ్మలబస్తీలో బస్తీబాటలో భాగంగా అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిటీ రాష్ట్ర కన్వీనర్ మన్నె శ్రీధర్ రావు మాట్లాడుతూ.. ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో మాలలపై మాదిగలు చేస్తున్న అసత్యప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. కమిటీ మహిళా అధ్యక్షురాలు అంజలి మాట్లాడుతూ.. వర్గీకరణకు వ్యతిరేకంగా మాల సామాజికవర్గానికి చెందిన మహిళలం తాఏకతాటిపైకి రావాలన్నారు. కార్యక్రమంలో బల్వంత్ రావు, రాజేశ్, గోకుల్, కమల్ పాల్గొన్నారు.

నేడు గన్ పార్క్ వద్ద ఉద్యోగుల నిరసన

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ టీజీవో, టీఎన్జీవో, ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో నేడు గన్‌పార్కువద్ద నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీజీవో హైదరాబాద్ జిల్లా కార్యదర్శి అబ్దుల్ ఖాదర్ తెలిపారు. శనివారం జలమండలిలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్రంలో ఏకీకృత పెన్షన్ విధానాన్ని అనుమతించవద్దని, 1980 రివైజ్డ్ పెన్షన్ రూల్స్ ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు.

- ఖైరతాబాద్

సమస్యలు పరిష్కరించడంలో విఫలం

సమావేశంలో మాట్లాడుతున్న తిరుమలై రామన్

హిమాయత్‌నగర్, ఆగస్టు 31 : యువజనుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్ ఆరోపించారు. శనివారం ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో ఏఐవైఎఫ్ రాష్ట్ర సమతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలై రామన్ మాట్లాడుతూ..ఉన్నత విద్య అభ్యసించినప్పటికీ ఉద్యోగావకాశాలు కల్పించడంలో కేంద్రం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ధనికులు ఆర్థికంగా మరింత బలోపేతం అయ్యేందుకు మోదీ సహకారం అందిస్తున్నారన్నారు. సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షుడు ఎన్.శ్రీకాంత్, రాష్ట్ర నాయకులు లింగం, రవి,శ్రీనివాస్, టి.సత్యప్రసాద్, రామకృష్ణ, శ్రీమాన్, యుగేందర్, మొగిలి లక్ష్మణ్, షేక్ మహమూద్, మానస్ కుమార్, సూర్య, రాజ్‌కుమార్,మాజీద్ అలీ ఖాన్, శ్రీను పాల్గొన్నారు.



సమావేశానికి విచ్చేసిన తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్

సమస్యల పరిష్కారానికి కృషి

వ్యవసాయ యూనివర్సిటీ, ఆగస్టు 31 : నాన్‌టీచింగ్ ఉద్యోగుల పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్ అన్నారు. శనివారం తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ కళాశాలలో పీవీవీ నాన్ టీచింగ్ ఉద్యోగుల సమావేశానికి ఆయన హాజరయ్యారు. పాత ఫెన్షన్ విధానం, మెడికల్ రీయింబర్స్‌మెంట్ న్యాయమైన డిమాండ్లను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లి అమలు జరిగేలా చూస్తామన్నారు. ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, సెంట్రల్ నాయకులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డా.ఎస్ఎం హుస్సేన్(మజీబ్) నాయకులను సన్మానించారు. నాన్ టీచింగ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ షర్ఫుద్దీన్ అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పొగాకు లద్దె పురుగును నివారించకుంటే అపార నష్టం

వ్యవసాయ యూనివర్సిటీ, ఆగస్టు 31 : ప్రధాన వాణిజ్య పంట అయిన పత్తిని ఖరీఫ్‌లో 12 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో సాగైంది. ప్రస్తుతం పిందె, కాయ దశలో ఉన్నది. పొగాకు లద్దె పురుగు అధికంగా కనిపిస్తోందని, నివారణ చర్యలు చేపట్టకపోతే అపార నష్టం వాటిల్లుతుందని ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం చీడ పీడల విభాగం ప్రధాన శాస్త్రవేత్తలు సూచించారు. నివారణకు వీలైనంత వరకు సమీప వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచన మేరకు జీవ రసాయన ఎరువులను వాడాలనీ, 5 శాతం వేప గింజల కషాయాన్ని పిచికారీ చేయాలి. ఎకరాకి 4 చొప్పున లింగాకర్షక బుట్టలు పెట్టి గమనించాలి. ఎకరాకు ఎర పంటగా ఆముదం మొక్కలను వేయాలి. పిందె, కాయ దశలో ఉన్నందున ఎకరాకి 10 కిలోల తవుడు, 2 కిలోల బెల్లం, లీటర్ మోనోక్రోటోఫాస్ లేదా, 750 గ్రాముల క్లోరిపైరిఫాస్ లేదా 300 గ్రా.థయోడికార్బ్‌ను సరిపడు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. నోవాల్యూరాన్ 1 మి.లీ లేదా లుఫెన్యూరాన్ 1.25 మి.లీ లేదా థయోడికార్బ్ 1.5 గ్రాములు తగు మోతాదు నీటిలో కలిపి పిచికారీ చేయాలని కలుపు, పురుగు నివారణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త డా. పద్మజ సూచించారు.

ప్రశ్నించే నాయకులపైనే ఈడీ దాడులు

ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న నరసింహ

హిమాయత్‌నగర్ : ప్రశ్నించే నాయకులపై ఈడీ, ఐటీ, సీబీఐను ప్రయోగిస్తూ బెదిరింపులకు పాల్పడుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు ఈ.టీ.నరసింహ మండిపడ్డారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో సీపీఐ నగర కార్యవర్గ సమావేశం జరిగింది. పాతనగర అభివృద్ధి కోసం కేంద్రం నిధులు కేటాయించకుండా మత రాజకీయాలు చేస్తుందన్నారు. చెరువులు, తోటలకు నిలయమైన హైదరాబాద్ కాలుష్య నగరంగా మారడంతో పెను ప్రమాదం పొంచి ఉందని, కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. నేటి(ఆదివారం) నుంచి 17 వరకు తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు. ఆనాటి త్యాగాలు, పోరాటాలను ప్రజలకు వివరిస్తూ విస్తృతంగా ప్రచారం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి ఎస్.ఛాయదేవి, సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, బి.స్టాలిన్, నాయకులు ఎన్.శ్రీకాంత్, ఒమర్ ఖాన్, మహమూద్ పాల్గొన్నారు.

సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మాజీ జడ్పీటీసీ తన్విరాజు

హాస్టల్‌ను సందర్శించిన కాంగ్రెస్ నాయకులు

శంషాబాద్ రూరల్ : పాలమాకులలోని కస్తూర్బా గాంధీ హాస్టల్‌ను శనివారం కాంగ్రెస్ నాయకులు సందర్శించారు. రాష్ట్ర ముదిరాజ్ సంఘం కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భోజనాన్ని పరిశీలిస్తున్న సమయంలో పిల్లలు ఈరోజు మంచిగా చేశారు. మూడు నెలల నుంచి పురుగుల అన్నం, నీళ్లసాంబర్ వేశారని వివరించారు. జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. సీఎం దృష్టికి సమస్యను తీసుకుపోయి విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఆయనతో పాటు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శేఖర్‌యాదవ్, కోటేశ్వర్‌గౌడ్, ఆనంద్, అశోక్ ఉన్నారు. మాజీ జడ్పీటీసీ తన్విరాజు, పార్టీ నాయకుడు చంద్రారెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు సందర్శించారు.

రైతులందరికీ రుణమాఫీ చేసే విధంగా చర్యలు

టెక్నికల్ అంశాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు, వైర్మన్ దవాణాకర్ గౌడ్

శంషాబాద్ రూరల్ : రైతులందరికీ రుణమాఫీ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చిన్నగోల్కొండ సహకార సంఘం చైర్మన్ దవాణాకర్ గౌడ్ తెలిపారు. శనివారం చిన్నగోల్కొండ సహకార సంఘం పరిధిలోని రుణగ్రస్తులు 373 మంది ఉన్నారు. వారిలో రుణమాఫీ 171 మందికి అయినట్లు తెలిపారు. మిగితా 202 మందికి కాలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ అధికారి శ్వేత, విస్తారణ అధికారి రాఘవేందర్ ఆధ్వర్యంలో అర్హులైన రైతులకు కుటుంబ సభ్యుల నిర్ధారణతో పాటు టెక్నికల్ సమస్యలను పరిష్కారం చేయడం కోసం ఫొటోలు తీయడంతో పాటు పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. శనివారం 55 మంది రైతులకు వివిధ టెక్నికల్ అంశాలతో పాటు కుటుంబ సభ్యుల నిర్ధారణ చేశామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు డైరెక్టర్లు, సహకార సంఘం ఉద్యోగులు రైతులు పాల్గొన్నారు.

పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ : ఓయూ పరిధిలోని డిగ్రీ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ కోర్సుల ఆరో సెమిస్టర్ ఇన్‌స్టంట్, మేకప్ పరీక్ష ఫీజును ఈనెల 12వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో 19వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

హెచ్ఏఎల్ ఎన్నికల్లో విజయం సాధించడం హర్షణీయం

హిమాయత్‌నగర్ : హెచ్ఏఎల్ గుర్తింపు ఎన్నికల్లో హెచ్ఏఎల్ వర్కర్స్ యూనియన్ విజయం సాధించడంపై ఏఐటీయూసీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోస్ హర్షం వ్యక్తం చేశారు. గుర్తింపు సంఘంగా ఉన్న హెచ్ఏఎల్ కార్మిక్ సంఘానికి హెచ్ఏఎల్ వర్కర్స్ యూనియన్ మధ్య జరిగిన ఎన్నికల్లో ఈ యూనియన్ గెలుపొందడం కార్మికుల విజయమేనన్నారు. హెచ్ఏఎల్ వర్కర్స్ యూనియన్ సలహాదారులు ఎస్.వి.శాస్త్రి, సుదర్శన్, సుబ్రమణ్యం, గౌరవాధ్యక్షుడు విజయ్ ప్రసాద్, అధ్యక్షుడు వెంకట్రాది, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ బాబు నాయకత్వంలో గెలుపుకోసం కృషి చేశారు.

సభ్యత్వ నమోదును విజయవంతం చేద్దాం

మైలార్‌దేవ్‌పల్లి : సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దుద్దాల లక్ష్మీనారాయణ, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి అన్నారు. హైదర్‌గూడలోని కార్యాలయంలో అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాబాద విజయ్‌కుమార్ అధ్యక్షతన సభ్యత్వ నమోదు సమావేశం నిర్వహించారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



బలరాంను సన్మానిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

శంషాబాద్ రూరల్, ఆగస్టు 31 : అంకితభావంతో పనిచేసిన రాజేంద్రనగర్ జోన్ శంషాబాద్ హెచ్ఈవో కడారి బలరాం శనివారం పదవీ విరమణ కార్యక్రమం శంషాబాద్ పట్టణంలోని ముదిరాజ్ సంఘ భవనంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. బలరాం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంతో కీలకంగా పని చేశారని పేర్కొన్నారు. అనంతరం దొడ్డి లక్ష్మీనారాయణ రచించిన ' భారత రాజ్యాంగం ఒక విశ్లేషణ' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు విజయపరిపూర్ణ, సృజన, డెమో తిరుపతయ్య, రాకేశ్, ఎంపీహెచ్ఈవో శ్రీనివాసులు, నారాయణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

పదవీ విమరణ చేసిన ఉద్యోగులతో డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

నిమ్స్‌లో ఉద్యోగుల పదవీ విరమణ

ఖైరతాబాద్, ఆగస్టు 31 : నిమ్స్‌లో సుధీర్ఘకాలం సేవలందించిన పలువురు ఉద్యోగులు పదవీ విమరణ చేశారు. ఆస్పత్రిలోని లెర్నింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పదవీ విరమణ చేసిన డిప్యూటీ రిజిస్ట్రార్ పి.రాజ్‌కుమార్, సీనియర్ మెడికో సోషల్ వర్కర్ పార్వతి, ఎక్స్‌రే టెక్నిషియన్ ఆనంద్ రావు, సెక్రటేరియేట్ అసిస్టెంట్ సత్యగీతలను ముఖ్యఅతిథిగా హాజరైన డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మిభాస్కర్, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్ శాంతివీర్, ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షులు కారం రవీందర రెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్, నిమ్స్ లైజనింగ్ అధికారి డాక్టర్ మార్త రమేశ్ పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు నిరంతర శ్రమ అవసరం

మణికొండ, ఆగస్టు 31 : లక్ష్యసాధనకు నిరంతర శ్రమ అవసరమని గండిపేట్‌లోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఆరుగురు విద్యార్థులు వేద ఐఐటీ వారు నిర్వహించిన వీఎల్ఎస్ఐ, ఎండేడ్డెడ్ సిస్టం డిజైన్ శిక్షణకు ఎంపికయ్యారు. శనివారం విద్యార్థులను అభినందించి శిక్షణ ఎంపిక పత్రాలు అందజేశారు. జేఎన్టీయూ హైదరాబాద్ వారిచే ఆమోదించబడిన వృత్తిపరమైన శిక్షణ కార్యక్రమానికి రెండు విడతలుగా నిర్వహించి ప్రవేశ పరీక్ష ద్వారా ఇంజనీరింగ్ చివరి సంవత్సరం వారిని ఎంపిక చేశారన్నారు. మొదటి సెమినార్‌లో శిక్షణ, రెండో సెమినార్‌లో ఇంటర్న్‌షిప్‌లలో ఉత్తీర్ణత సాధించి తమ గ్రాడ్యూయేషన్‌ను పూర్తి చేస్తారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎస్.పి.సింగ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఎంజీఐటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్